మాణిక్యము

(ఒక చిన్న కథ)

రాయసము వేంకటశివుఁడు గారు, యం. ఏ. యల్. టి.

లోకులు నన్నుగుఱించి విపరీతముగఁ జెప్పుకొనిన నేమి? వారు పరిహసించినను పొగడ్తలు సలిపినను నాకొక్కటియే. నన్నుగుఱించిన సంగతులన్నియు వారికిఁ దెలియవు. కావుననె వారీవిధముగ నావిషయమై యూహాపోహములు పడుచున్నారు.

వసంతకాలమున లేఁతమామిడిపిందెల సువాసనలు నా కనుకొలుకుల నేల దుఃఖబాష్పములతో నింపవలయును? "ఇస్సీ, మనోహర మెంతటి పిఱికివాఁడు! అతనికి మల్లెమొగ్గలనిన నెంతో భయము!" అని బాలకులు సహితము నన్ను గేలిచేయఁజూచెదరు. ఇంకఁ బెద్దవారలకు నాబ్రహ్మచర్యము విపరీతపుచర్య. ఎంతయో నియమముతో నేఁ బూనిన దీక్ష వారు నిరర్థకమును ఛాందసమును ననుకొనుచున్నారు. కానిండు. వారితో నాకుఁ బని యేమి? పాఠకోత్తములారా! నాచిన్ననాఁటిసంగతి యొకటి మీకు వినిపించెదను. దానిని బట్టి మీరు సత్యమును గ్రహింతురుగాక!

మా ప్రయాణము

పరీక్షలో గెలుపొంది, యుద్యోగమునఁ జేరఁగాని నేను వివాహముసంగతి తలపెట్టనని చిన్ననాఁడు నియమము పూనితిని. ఎట్టకేలకు నాయుద్దేశము నెఱవేఱి పరీక్షలోఁ దేఱి, యుద్యోగమును స్వీకరించితిని. అంత నాకువచ్చిన వివాహపుసంబంధములను గొన్ని కన్నులారఁ జూచి మఱి పరిణయము గాఁ గోరి, నామిత్రుఁడు నేనును బయనమైతిమి. ఆ సంవత్సరమున వసంతకాలమున నెండలు తీవ్రముగ నుండెను. పగటిపూఁటయం దధికముగఁ బ్రయాణముచేసి, వేళకు భోజన సదుపాయములు లేకపోవుటచేత, మే మిరువురమును దేహస్వాస్థ్యము తప్పి, యొకానొక నాఁటియుదయకాలమున నొకగ్రామము చేరితిమి. అది కుగ్రామము. మిత్రుఁడును నేనును డస్సియుంటిమి. ఊరిలో నడుగఁగా, ఒకచోట మాకు బస చూపించిరి. ప్రయాసముతో మేము బండిదిగి, ఎటులో దేహముల నాయింటఁ జేర్చితిమి.

అది పూరిల్లు. ఐనను వాససౌఖ్య మెఱిఁగినవారు కట్టినట్టిదిగఁ దోఁచెను. ఇంట నెవ్వరును లేరు. యజమానుఁడు ఉద్యోగపు కార్యములమీఁద నెచటికో పోయి యుండెను. స్త్రీలజాడయైనను గానిపింపలేదు. మా ప్రయాణములో భోజనవిచారణను గుఱించి స్నేహితుఁడే శ్రద్ధఁ బూనుచుండును. ఇపుడాతఁ డాయిల్లు నలుదిశలును పరిశీలించి,

"ఈదినము మనకు హరివాసరమే!" యని, తాపత్రయము పంక్తులు మూఁడుగాఁదీర్చి మొగమునఁ జిత్రింపఁబడెనా యనునట్టుగ మోము చిట్లించి, నేను బండుకొనియుండు చాఁపమీఁదఁ దాను నట్టె గూలఁబడెను.

కొంత సేపటికి కోనేటినుండి నీటిబిందె



బుజము మీఁదఁ బెట్టుకొని బాలయొకతె వచ్చెను. ఆబాలికతో నేనెంచు పెద్దవారి నెవరినైనఁ బలుకరించెద మనుకొంటిని కాని, అట్టి వారెవ్వరును రాలేదు. పగలు పదిగడియల ప్రొద్దెక్కినది. కాని మట్టమధ్యాహ్నమప్పటివలె సూర్యరశ్మి తీవ్రముగఁ దోచెను. ఆఁకలి మమ్మిరువురను బీల్చి పిప్పిచేయుచుండెను. మాటాడుటకైనను శక్తిలేక నామిత్రుఁడుండెను. నేనును శోషిల్లియుంటిని. చిక్కిన వారు సిగ్గెఱుఁగరు. నేనపుడు మోమోటము వదలి, "అమ్మాయీ! మేము మార్గస్థులము. మిక్కిలి యాఁకలితో నున్నాము. పాపము, మీయింట నీవుతప్ప నెవరు నున్నట్లు తోఁపదు. వంటచేయుమని నిన్ను బాధించుట తగదు. మాకుఁ గొంచెము బియ్యమును పాత్రయును జూపించిన యెడల, వంటఁజేసి కొనెదము" అని మరియాదకై నేనంటినే గాని, నిజముగాఁ గాలుకదలించుటకైనను మాకు శక్తిలేకుండెను.!

కాని సిగ్గునణఁచుకొని యాబాలిక, "ఆశ్రమమీ కెందుకు? వంటయగుచున్నది. మానాయనయు నిపుడె వచ్చెదరు. శీఘ్రమే భోజనము చేయవచ్చును." అని పలుకఁగా, మా కా మాట లమృతోపమానములయ్యెను. మేము

కోరకయే మాకాతిథ్య మీయనున్న యా బాల, అన్నపూర్ణాదేవిని మాకు స్ఫురణకుఁ దెచ్చెను. కృతజ్ఞతను దెలుపుటకు మాటాడుటకైన శక్తిలేక, కన్నుల యానందబాష్పములను మఱుఁగుపఱుచుచు, నేనంత నేల నెఱిగితిని. మిత్రుఁడు నేను నంత గాఢసుషుప్తియందు మునిఁగి పోతిమి.

పరులయింట విందు

"అయ్యా! మిక్కిలి ప్రొద్దెక్కినది. కాళ్లు కడిగికొని భోజనమునకు రండు!" అను నొక పురుషుని కంఠస్వరము రెండు మూఁడు సారులు నాకు వినఁబడి, నిద్రనుండి లేచితిని. "నేను వచ్చువఱకును మీకు భోజనమేల పెట్టలేదని మా యమ్మాయిమీఁద నేను కోపపడితిని. లెండి." యని గృహాధిపతి భోజనశాలలోనికి మమ్ముఁ గొనిపోయెను.

ఆనాఁటి యుదయభోజనపు వత్తాంతము నాకంతగ జ్ఞప్తిలేదు. ఇంటియజమానుఁడు భోజనసమయమున మాతో ననుచుండిన మాటలు బావిలోఁ బడినవాని చెవ్రలకువలె మాపీనులకు వినవచ్చుచుండెను. నిద్దురతో మేము తూఁగుచునే భుజించితిమి. కాని యన్నరసము జఠరమునఁ బ్రవేశించిన కొలఁదిని నిద్దురమత్తు కొంత తగ్గెను. మేమెట్టులో మెతుకులు నోటవేసికొని, తిరిగి చావడి మీఁదికిఁ జేరితిమి. సాయంకాలమునందలి యీ రెండ గానఁబడువఱకు మాకు నిద్దుర నుండి మెలఁకువ రాలేదు. అప్పుడు లేచి చూడఁగా, గృహమేధి యుద్యోగసంబంధపు కార్యమందును, పుత్రిక రాత్రిభోజన ప్రయత్నమునను నుండిరి.

భోజన సమయమునకు మాకుఁ గన్నులు విచ్చెను. అంతవఱకును, ఇంటియజమానుఁడు "మీ దేయూరు? పనియేమి?" అను ప్రశ్నములు మమ్మడుగలేదు. అడిగియుండినను మాకు జ్ఞప్తిలేదు. స్థితిగతులు కొంత సన్నగిల్లినను, ఆయన సాధుపురుషునివలె మాకగపడెను. కొలఁదికాలము క్రిందటనె పత్నీవియోగము సంభవించుటచేత, తనకీ యేకపుత్రికయే యాధారమని యాయన చెప్పినప్పుడు, మాకు విషాదముగలిగెను. తన గోడవలో మా సమాచారమడుగ మఱచితినని యాయన పలుకఁగా, నా మిత్రుఁడు రామనాథము మా ప్రయాణవృత్తాంతము సంగ్రహముగఁ జెప్పి, "అయ్యా! మా మనోహరము పెండ్లిపయనములలో నిట్లు మాజవసత్త్వము లడిగిపోవుచున్నవి. ఒకటి కుదిరిన నొకటి కుదురకున్నది. చదువున్నఁ జక్కఁదనములేదనియు, సంగీతములేని సౌందర్యమేల యనియును, సందియములతో, దల్లడిల్లుచున్నాఁడు. ఈతని పెండ్లిసంగతి యిఁక దేవునికిఁ దెలియునుగాని, నేను శీఘ్రమె యిలు చేరనిచో మాట దక్కునట్లుతోఁపదు" అని యతఁడు చెప్పివేసెను.

రామనాథము మంచివాఁడు. శాంతమూర్తి. ఏపనిగాని వేగిరపడి చేయువాఁడు కాఁడు; ఇతరులు చేసిన నోర్చువాఁడును గాఁడు. ఆ రాత్రి నిద్రించుటకుఁ బూర్వము మేమిరువురము గలసి మాటాడుకొంటిమి. "మనోహరమూ! పెండ్లివిషయమున నీ కింతటి గట్టిపట్టు ఉండఁగూడదు. ఇంక ఖండాంతరములు

గడచిపోయినను, నీ కంటికింపగు కాంత గానం బడుట కష్టము!" అని విసుగుచుం బలికెను.

మఱునాటి యుదయమున రామనాథము మాటలు వినంబడి, పడకనుండి దిగ్గున లేచితిని. ఒడలంతయు భారముగం దోంచెను. కన్నులు మండుచుండెను. బండిచప్పుడు వినంగనే రామనాథము నాయొద్దకు వచ్చి, "మనోహరమూ! నేను బోయివచ్చెదను నీ వీబడలికతోం బయనము చేయంగూడదు. పరులయింట నుభయములమును నిలిచియుండుట భావ్యముగాదు. కాన నేను బోవుచున్నాను. నీకు నెమ్మది గలిగినతోడనే బయలుదేఱుము" అని నాకు బోధించెను. అంత నేను, "సరేకాని, మనము వచ్చినపని పూర్తికాలేదే?" యని పలుకంగా, ఎప్పుడు పోవుదునాయని యాతురతతో నపుడే బండిలోం గాలుపెట్టుచుండు నా మిత్రుండు "దానికేమిలే మనసు కుదిరినచో మను నెంత సేపు?" అనుచు బండి సాగించెను.

ఆదినమంతయు తీవ్రజ్వరము నన్నుం బీడించెను. ప్రొద్దెక్కిన కొలందిని ఉష్ణమతిశయిల్లెను. కాలుసేతులు పీకుకొనిపోవుచుండెను. దగ్గఱనుండు స్నేహితుండుకూడ విడిచిపోయెనే యని నేను బరితపించితిని. పగటికంటె రాత్రి నాబాధ యధికమయ్యెను. అప్పుడప్పుడు కనులు తెఱచి చూచునపుడు, నాకుం గాళ్లు వట్టుచు గృహస్థుండును, పానీయమిచ్చుచుం గుమార్తెయును, కలలోని బొమ్మలవలెం గాన వచ్చుచుండిరి.

క్రొత్తబంధువులు

ఒక పవలురాత్రియు మాత్రమే నన్ను జ్వరము పీడించినను, నాశరీరము నందలి జవసత్త్వముల నది మొదలంటం గొనిపోయెను. అన్నమనిన బొత్తిగ నితవులేకుండెను. పడక విడిచి రెండడుగులు వేయంగనే కన్నులు గిర గిర తిరుగుచుండెను. ఆపరిస్థితులందు నాకా గృహస్థుండే దిక్కు. ఆయన సౌజన్యమింతింత యని చెప్పంజాలను. "చుట్టమై చూడవచ్చి దయ్యమై పట్టుకొనె" నన్నట్లు, అతిథిగా నేతెంచి వారింటికడ నేను దినములకొలంది నిలిచితినని నామీఁద నించుకయు నాతండు విసివికొనండు. వలసిన యౌషధము లిచ్చుచును, ఇంపగు మాటలు చెప్పుచును, దైవము వలె నన్నాయన కాపాడెను. ఇంకను నధికముగ నాకు సాహాయ్యము చేయలేదనియే యాయన నొచ్చుకొనుచుండును.

ఇంక నాతని పుత్రికను గుఱించి యేమని చెప్పంగలను? జనకుని శాంతభావమంతయు స్త్రీరూపము దాల్చివచ్చెనా యనునట్టుగ నాబాల గానంబడెను. అంతటి లేవయస్సున నట్టి వివేక సౌజన్యములను గలిగియుండు వారెచటం గలరు? కఱిగియుం గలుగని నిపుణతతోనే యామె యిట్టిపనులు దిద్దుకొనుచు, కోపము విసువు ననునవి యెఱుంగకం అన్నమనిన వాంఛ లేకుండు నాజిహ్వకుం దిరిగి యాహారమునందు రుచి గలుగంజేయుటకై, లెక్కలేని చిన్నచిన్న పచనములు పచ్చడులనుగల్పించుచుండును. సదయహృదయ యగు నాకోమలి యుపచారములవలననే నేను దెప్పిఱిలి, తప్పటడుగులిడుచుం గ్రమమున శక్తి గలవాండనైతిని. బాలికలందు నైసర్గికముగ మాతృగుణములు దాంగి యుండునను శాస్త్ర

వచనము నాకప్పుడు స్ఫురణకు వచ్చెను. ఈ మాణిక్యము మాణిక్యమేయని నేనపుడు గ్రహింపఁ గలిగితిని

ఒకనాఁటి మధ్యాహ్నసమయమున నేను మంచముమీఁదఁ బండుకొని, నాస్థితిగతులను గుఱించి యిట్లు తలపోయ సాగితిని. "ఆహా! దైవసంఘటనము లెంత విచిత్రములు! ఒక కార్యార్థమై మిత్రునితోఁ బయనము చేయుచు, మార్గమధ్యమున దేహస్వాస్థ్యము తప్పి పరులయింటఁ జేరితిని! ఇప్పుడు నాకీ గ్రామమే జన్మస్థల మయ్యెను! ఇంటివారు చిరకాలపు స్నేహితులైరి! కాని పరులయింట నీ లంకణములలోని మనుగుడుపులలో నామనుప్రసంగతి మఱుమాయమయ్యెనే!"యని, యిట్టి విడ్డూరమున కాశ్చర్యపడితిని.

పథ్యపు మెతుకు లొంటఁబట్టినకొలఁది, పూర్వపు వేగముతో నామనస్సు తిరుగఁ జొచ్చెను. రామనాథము వెడలిపోవుచుఁ బలికినపలుకులు మఱల మఱల తలంపునకు వచ్చుచుండును. అతని వాక్కులే నిక్కువమైనచో, ఇంకను ధాత నాకొఱకు వధువును సృజింపనే లేదు! కానిచో, చూచిచూచి లోపములతో నున్న యేబాలనో నేఁగట్టుకొనవలయును! ఇట్లు మనువుప్రసంగతి నాలోచించినకొలఁదిని తెంపులేని యూహలకుఁ దావలమై నామనస్సు డస్సిపోవుచుండుటచేత, అది యెటులైన మఱచిపోవుటకుఁ బ్రయత్నించుచుండును.

మాణిక్యము

మనస్సునకు వేఱు వ్యాయామము లేకపోవుటచేత, ఆదినములలో నేను జుట్టునుండు వస్తుసముదాయమును బరిశీలించుటయందే ప్రొద్దు పుచ్చుచుంటిని. ఈ జగన్నాటకరంగమున నాకన్నుల కపుడు గోచరమగు పాత్రములు రెండే. వారు మాణిక్యము, ఆమెజనకుఁడును. పితాసుతల గుణావలోకనమే యపుడు నేనుమనస్సునకు ముఖ్యవిషయముగఁ గల్పించుకొని వినోదించుచుందును. జనకుని సౌజన్యాది గుణములు మాణిక్యమునందు ద్విగుణీకృతమై యొప్పారుచుండును. కాని యాలలన రూపలావణ్యాదులపోకడలుమాత్ర మంతగ జనకునియాకృతియందుఁ బొడకట్టవు. మాణిక్యము యొక్క రూపవర్ణనము చేయునపుడొక సంగతి పరికింపవలయును. పదిమంది బాలికలనడుమనిలువఁబడినపుడు మాణిక్యము యొక్కయంద మంతగఁ గానవచ్చునదిగాదు. శరీరసౌకుమార్యమునందును, ముఖకాంతియందును, ఆకాంతనుమించు మించుఁబోఁడులు పలువురు గానవచ్చెదరు. ఆచాన చక్కఁదనము చూచినతోడనే చూపఱకన్నుల మిఱుమిట్లు గొల్పునట్టిది గాదు. అట్టి సుదతుల సౌందర్యమును గుర్తించుటయందు పురుషులు సామాన్యముగ మోసపోవుదురు. జ్ఞానముచే నుత్తేజితమగు నాసుందరిచక్షువులను బరిశీలించువారికిమాత్ర మా చెలువ చక్కఁదనము విస్పష్టమగును. సోగకన్నులనుండి సౌందర్యలహరి బయలువెడలి మందగమనమున నాముదిత ముఖసీమయంతటను నాట్యము సల్పుచుండునటులఁ దోఁచును.

మాణిక్యముయొక్క యందము ఆకలికి విశాలనయనములందేగాక, పలుకు పలుకు

నందును, చేయు ప్రతికార్యమునందును ప్రకటీకృతమగుచుండును. ఆ ముద్దియ ముద్దు పల్కులు, నిర్మలినమును గరుణాపూరితమును నగు హృదయముయొక్క ప్రతిబింబములే. ఆ తీయ్యలితేనెపలుకులు దేహమనఃక్లేశములను దూరీకృతముచేయుటకు సమర్థములుగా నుండును. ఆడుచుబాడుచు నాచేడియచేయు చిన్నిపనులు, గృహకృత్యములం దారితేఱినవారు చేయువానికంటె హృద్యములుగ నుండును. వానియందు లోపములున్నను, ఆ లోపములె వానికిఁ గ్రొత్తరుచులను గల్పించునటు లుండును.

గ్రామ నివాసియగు మాణిక్యముయొక్క యాటపాటలు వినోదములును నేను గుతూహలముతోఁ గనిపెట్టుచుండును. పనులన్నియు దానే చక్కఁబెట్టవలసి వచ్చినను, ఎప్పుడును వానిలోనే మునుఁగుచుఁ దేలుచునుండక, అప్పుడప్పు డాయువిద విశ్రాంతి గైకొనుచుండును. మధ్యాహ్న మాకోమలి కాటవిడుపు సమయము. అప్పు డా బాల పొరుగిండ్లకును, పొరుగింటి బాలికలు వీరింటికిని, రాకపోకలు సలుపుచుందురు. ఆటలలో వీరు ధరించు భూషణములు పెరటిలోని మల్లెమొగ్గలును, కోనేటిలోని చెంగలువపూవులును. మాణిక్య మీనగలను బిమ్మటను దాల్చుచుండును. అపుడా యెలనాగ సోయగమునకుఁ గ్రొత్తవన్నె వచ్చినటు లుండును.

మనుప్రసంగతి మఱచిపోవలయు నని ప్రయత్నించు నామనమున కిట్లు మాణిక్యము రూపగుణావలోకనము మఱల దానినే జ్ఞప్తికిఁ దెచ్చెను. కాని యీమాటు రామనాథము మాటలసత్యము నా కనుభవమునకు వచ్చెను. నా మనస్సును వెతనొందించెడి సందియము లిఁక వీడినవి. పరిణయ మపేక్షించితినా నేను జేసికొనవలసినబాల లోకములో నొకర్తుకయ కలదు. "ఆ కన్నియ చేకూరెనా, నా కిహలోకసౌఖ్యము. లేనిచో నేను గృహస్థాశ్రమమునకు వెలియయ్యెదను", అని నేను నిర్ధారణ చేసికొంటిని.

ఆబాల యెవతెయో పాఠకులకుఁ దెలుపవలయునా?

దుఃఖవార్త

తరువాతి వృత్తాంతము త్వరితముగఁ జెప్పవచ్చును. నా యుద్దేశమును పిల్లఁగ మాణిక్యము జనకునితోఁ జెప్పితిని. ప్రథమమున నాశ్చర్యనిమగ్నుఁడయ్యెను, బాగుగ నాలోచించి యాయన దానికి సమ్మతించెను. ఆయనవలనఁ దనవివాహవృత్తాంతమును విని యుండిన మాణిక్య మంత నాకంటబడుటమానెను. ఇంక నొకటి రెండు దినములలోనే నేను బయలుదేఱి స్వగ్రామమునకు మఱలి వచ్చితిని.

పట్టనమందలి వృత్తిసంబంధమగువ్యాపారములలో నేనంతఁ దిరిగి ప్రవేశించి, పనులు జరుపుకొనుచుంటిని. ఇట్లు దినములు వారములును గడచిపోయెను. నేను ఉద్యోగస్థానమందలి కృత్యములలో గొట్టుమిట్టాడుచుండుటవలన మాణిక్యముసంగతి తలఁచుగఁ దలంచుటకుఁగాని, వారిరువురి నేమ మరయుటకుఁగాని, నా కవకాశము లేకపోయెను. ఇటులుండఁగ నొకా

నొకదినమున నాకొకరు ఉత్తరమొకటి తెచ్చి యిచ్చిరి. అది నేను విప్పిచూడఁగ నం దిటు లుండెను.—

చి. మనోహరమునకు, కలువలూరు.

నా వెనుకటి యుత్తరము నీ కిదివఱకే చేరి యుండును. దైవమునకువలెనే నీకును మామీఁదఁ గరుణ తప్పినది. లేనియెడల నిది వఱకే వచ్చియుందువు. అమ్మాయి గడియల మీఁదనున్నది. కాని నిన్నుఁజూచినఁగాని ప్రాణము విడిచిపోనట్లుగ నున్నది. ఒకసారి వేగమె రావలెనని వేఁడుచున్నాను. ఇదే నాకోరిక.

వెంకటేశ్వరులు

ఈలేఖ రెండు పర్యాయములు నేను జదివినను, దానియర్థము నాకు మొదట బోధపడలేదు. పొరఁబాటున నాకింకొకరి యుత్తరమిచ్చిరివని నేను జెప్పినను, లేఖ నాదేయని యాతఁడు పలికెను. కలువలూరివారికిని నాకును జుట్టఱికమెట్టిదని నేనచ్చెరువందితిని. కాని లేఖ గొనివచ్చినవాఁడు తెలిపిన యొకటి రెండానవాళ్లనుబట్టి, వెనుకటి సమాచారమంతయు నాకు జ్ఞప్తికి వచ్చెను. ప్రాణసమానయని నేను భావించిన మాణిక్యమును గుఱించియే యీలేఖ! ఆమె జనకుఁడే యిది వ్రాసి పంపెను! వ్యాధిగ్రస్తయగు మాణిక్యమును నేనిట్టి సమయమున సందర్శింపరాదని యూహించి మాయింటనుండువారు మొదటి యుత్తరము నాకంటఁ బడనీయలేదని నాకిపుడు తెలిసినది. ఆహా! ఎంతటి మూర్ఖపుఁబని చేసిరి! లేనిచో నేనిదివఱకే మాణిక్యమును జూచుటకవకాశము గలిగెడిది. కాని యింక జాగు చేయఁగూడదని యెంచి, వేగముగఁ బోవు గుఱ్ఱపుబండి నెక్కి, శీఘ్రమే గమ్యస్థానముఁ జేరితిని. సరస్సున వెనుక నెంతో కలకలమను నెఱ్ఱకలువ లిపుడు ముఖములు ముడుచుకొని నటు లున్నవి! వీథిలో నగపడువా రెవ్వరును నన్నుఁ బలుకరింపకుండిరి!

అప్పుడు నేను వాయువేగమున నిల్లు సొచ్చితిని. "ఇప్పుడేలపోయెదరు?" అని యడ్డగించువారి మాటల సరకుగొనక నేను రోగి మంచము దగ్గరకుఁ బోయి నిలిచితిని. తులసిదళములతో జలబిందువులను మెల్లఁగ రోగి గొంతులోఁ బోయుచున్న మాణిక్యము జనకుఁ డపుడు నన్నుఁజూచి, "వచ్చితివా నాయనా!" యని కంటఁ దడిపెట్టి పలికెను. ప్రాణావసాన స్థితియందున్న మాణిక్య మపుడు, తన సోగకన్నులు తెఱచి, నావైపునకు దృష్టి నిగిడించెను. విషజ్వర ప్రకోపమువలన దేహము మిగుల శుష్కించియున్నను, చక్షువులు మాత్రము సహజసౌందర్యముతో నింకను వెలుంగుచుండెను. ప్రభాతసమయమున నల్లకలువమొగ్గలనుండివలెనే యపుడా లలన కన్నులనుండి జలబిందువులు జలజలమని రాలెను. మిగుల ప్రయాసతో బాలిక యంత తనకుడిచేతి నెత్తి సైగచేయఁగా, నేను మిక్కిలి దగ్గరగఁ బోయి, కలువకాఁడవలెఁ జల్లనగుచున్న యాహస్తమును దాఁకితిని. అప్పుడు నాచేతిని మెల్లఁగఁ దనపెదవుల యొద్దకుఁ గొనిపోయి, ముద్దిడి, మాణిక్యము మెడ వెనుకకు వేసెను. "మాణిక్యమా! నేను

వచ్చితిని. నీకిఁక భయములేదు సుమీ!" యని ప్రోత్సాహపఱుప నెంచి యెట్లో నేఁ బలికితిని. ఔనని సూచించుటకై తలయూఁపనెంచి, యా కాంత యంతటఁ గన్నులు తేలవైచెను. ఆకనుకొలుకుల నుండియే జీవము లేచి పోయెను.

నా నియమము

ఇంక నేఁ జెప్పవలసినదేమిగలదు? నా మనోనాయికయగు మాణిక్యము చెల్లి పోయెను. నా కిఁక మను వక్కఱలేదు. స్త్రీ జాతితో నాకు సంబంధము తీఱిపోయెను. మాణిక్యము సుందరాంగకములఁ బోలిన పదార్థములును, ఆలలనామణిని జ్ఞప్తికిఁ దెచ్చు వస్తువిశేషములును, నాకిపుడు కంటకసదృశములు. ఆ సుందరి సోగకన్నులను బోలిన నీలోత్పలములను జూచి నేను శోకింతును. జడలో నెంతో సింగారముతో నా రమణి ముడుచుకొను మల్లెమొగ్గలు నాకు విషప్రాయములు. చిన్నిచేతులతో నా కోమలి కోసి నాజిహ్వకుఁ జైతన్యము గలిగించిన మామిడి పిందెల సువాసనలు, హృదయకమలముఁ గమలఁ జేయు వహ్నికీలలు!

మాణిక్యము గతించి యిప్పటి కనేక వత్సరములైనను, ఆ కాంత కాష్ఠపు వేడిమి నాశరీరమున కింకను సోఁకుచునేయున్నది. ఒకానొకప్పుడు నాకీలోకము యమలోక సదృశమగును. అప్పుడు వృత్తియు వ్యాపారమును విడిచి నేనిఁక జడునివలె లోకమునఁ దిరుగాడఁ జూచెదను. కాని జీవితముయొక్క పరమార్థమంతయు దుఃఖనిరోధమునందె నెలకొని యుండుట గుర్తెఱిఁగి, బుద్ధిని మరలించుకొని, ఉద్యోగపుఁబనులను ముకుత్రాళ్లతో మనస్సును బంధింప నుద్యమింతును. కాని యేమి చేసినను, మాణిక్యమువలననుండి నామనస్సు మరలి రాకున్నది. ఇది వట్టి భ్రమయని మిత్రులు గేలిచేసి నాకుజ్ఞానబోధనముఁ జేయఁ జూచిరి కాని, నాకుమాత్ర మా సుదతి సంగతియే పరమసత్యముగఁ గన్పట్టును. ఈమనఃక్లేశముల నన్నిటిని వివాహమై మఱచిపొమ్మని బంధువులు పలుమారు నా కుపదేశించిరి. కాని నాయవ్యాజప్రేమమున కాస్పదమై, నాతో సాంసారికసౌఖ్య మనుభవింపఁ బుట్టెడాసఁ బెట్టుకొనియును, తా నకాలమృత్యువు వాతఁ బడుటవలన విఫలమనోరథయైన వనితను విడనాడి, వేఱొక యింతి చెట్టవట్టుటకు నామనసున కీసుమంతయు నిచ్చపొడమకున్నది.

దుఃఖభూయిష్ఠమగు నీ మర్త్యలోక యాత్ర సమాప్తమై, విహంగము రీతిని నా యాత్మ నాకలోకమున కెగసి, యనతిదూరమున, నూత్న పారిజాత ప్రసూనములను గోసి, వానితోఁ బ్రియునకాతిథ్య మీయ వేగిరపడియును, నైసర్గికమగు తన యొయ్యారపు నడకలను మొదలంట వీడనేరక మందగమనమున నేతెంచు మాణిక్యముయొక్క సందర్శనసౌభాగ్యము నాకుఁ జేకుఱినప్పుడు, విఘాతములేని శాంతిని సౌఖ్యమును గ్రోల నేనువ్విళులూరుచు నున్నాఁడను.

(భారతి - మాస పత్రిక - [illegible], 1924)